క్లుప్తంగా

నేడు వైఎస్సార్‌సీపీ ప్రచారం

సి.బెళగల్: మండల పరిధిలోని బురాన్‌దొడ్డి, క్రిష్ణదొడ్డి, గొల్లలదొడ్డి గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం జరుగుతుందన్నారు. పార్టీ నాయకులు విజయవంతం చేయాలని కోరారు.

టీడీపీ మాయలో పడొద్దు



గడిగరేవులలో ప్రచారం చేస్తున్న కాటసాని శివనరసింహారెడ్డి

గడివేముల: ఎన్నికల సమయంలో టీడీపీ నాయకులు చెప్పే కల్లబొల్లి మాటలు నమ్మి మోసపోవద్దని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తనయుడు శివనరసింహారెడ్డి అన్నారు. గడివేముల మండల పరిధిలోని గడిగరేవుల గ్రామంలో అదివారం ఇంటింటి ప్రచారం చేశారు. 2014 ఎన్నికల్లో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన విషయాన్ని మరిచిపోవద్దని సూచించారు. రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేయడానికి విపక్షాలు మీ ముందుకు వస్తాయని, అలాంటి వారిని నమ్మవద్దని కోరారు. సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తే పేదలకు మరింత మేలు చేకూరుతుందన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి కాటసాని రాంభూపాల్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. ఎన్ని కూటములు ఏర్పడినా ప్రజల గుండెల్లో జగన్‌మోహన్‌రెడ్డి స్థిరంగా నిలిచిపోయారన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ శివరామిరెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మ, వైస్ ఎంపీపీ కాలునాయక్, సింగిల్‌విండో చైర్మన్ పోగుల చంద్రశేఖరరెడ్డి, సర్పంచ్ రామ్మోహన్ రెడ్డి, ఉప సర్పంచ్ ప్రసాద్, కో ఆప్షన్ సభ్యుడు బాషా, సునీల్ కుమార్ రెడ్డి, దస్తగిరిరెడ్డి, శివానంద రెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, గోపాలయ్య, మేఘనాథరెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, దేశం నాగేశ్వరరెడ్డి, ఎల్లారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రఘు మాధవ రెడ్డి, రాఘవయ్య, బాల చిన్ని, పుల్లయ్య పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని గెలిపించుకుందాం



మీదివేములలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఉమామహేశ్వరమ్మ

ఓర్వకల్లు: సంక్షేమ పథకాలతో ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుంటేనే అందరికీ మేలు జరుగుతుందని కాటసాని ఉమామహేశ్వరమ్మ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం సాయంత్రం మండలంలోని మీదివేముల గ్రామంలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా మామహేశ్వరమ్మ మాట్లాడుతూ.. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డిని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. టీడీపీ అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి ఆయన్ను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ రజితమ్మ, నాయకులు పద్మనాభరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాళ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

హొళగుంద: దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు స్వామి వారి మూల విరాట్‌లకు సుప్రభాతం సేవా, అభిషేకాలు, రుద్రాభిషేకం, బండరార్చన, కుంకుమార్చన, మహామంగళహారతి, నైవేద్య సంతర్పణతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

కర్నూలు కల్చరల్: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత కలుగుతుందని ఇస్కాన్ కర్నూలు బాధ్యులు రఘునందన సేవక్ దాస్ అన్నారు. ఆదివారం స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని పూరి జగన్నాథ మందిరంలో ప్రభుపాదుల ప్రేమ విందు, భగవద్గీత శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల్లో నైతికత పెంపొందేలా మన ఇతిహాసాల గురించి వివరించాలన్నారు. మానవ జీవితానికి భగవద్గీత మార్గదర్శిగా నిలుస్తుందన్నారు. అనంతరం జగన్నాథ్, బలదేవ్, సుభద్రలకు నైవేద్యం నివేదించి భక్తులకు వితరణ చేశారు.

వైఎస్సార్‌సీపీతోనే గ్రామాల అభివృద్ధి

- మంచి చేసిన నాయకుడికి అండగా నిలవండి
- టీడీపీ నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకోం
- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- పాణ్యం మండలంలో విస్తృతంగా ప్రచారం



కొండజుటూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పాణ్యం: ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో గ్రామాలు అభివృద్ధి చెందాయని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాయని.. మరింత మేలు జరగాలంటే మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం పాణ్యం మండలం కొండజుటూరు, గోరుకల్లు, వడ్డుగండ్ల, ఎస్.కొట్టాలలో పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఆయనకు ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో సంక్షేమ పథకాలు పొందాలంటే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదని.. 2019 నుంచి ఆ పరిస్థితి మారిపోయిందన్నారు. అర్హత ఉంటే చాలు ఇంటి ముంగిటకే పథకాలు చేరుతున్నాయని తెలిపారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా స్థానికంగా ప్రభుత్వ సేవలు అందుతున్నాయని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని గ్రామాలు కూడా ఈ ఐదేళ్లలో ఎంతో అభివృద్ధి చెందాయని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులు, రైతు భరోసా కేంద్రాలు, రోడ్లు, కాలువలు, సచివాలయాలతో కళకళలాడుతున్నాయని తెలిపారు. ఇలాంటి మార్పు తీసుకొచ్చిన ఘటన వైఎస్ జగన్‌దేనన్నారు. కొండజుటూరులో గ్రామంలో సుమారు రూ. 5 కోట్ల అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. సీసీరోడ్లు, డ్రైనేజీ కాలువలు, మంచినీటి ట్యాంక్‌లు నిర్మించామన్నారు. గోరుకల్లు గ్రామంలో మైనింగ్, జీజీఎం, ఇతర నిధులు రూ.2కోట్లతో సీసీరోడ్లు, డ్రైనేజీ కాల్వలు, తాగునీటి ట్యాంక్‌లను నిర్మించి ప్రజలకు సురక్షిత నీటిని అందించినట్లు వెల్లడించారు. గోరుకల్లు జలాశయంలో అర్హులైన వారికి చేపలు పట్టేందుకు సొసైటీలో చేర్చుతామని హామీ ఇచ్చారు. వైఎస్సార్ హయాంలో ముస్లింలకు 4శాతం రిజర్వేషన్లు కల్పించినట్లు గుర్తు చేశారు. నెలవాడ గ్రామంలో హైవే నుంచి పుట్టాలమ్మ ఆలయం వరకు బీటీ రోడ్డు వేసి ప్రయాణ కష్టాలను తీర్చామన్నారు. గ్రామంలో రోడ్లు, మినరల్ వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతు భరోసా రూ. 13 వేల నుంచి రూ.16 వేలు, పింఛన్ రూ.3,500కు పెంచుతామని జగన్ మేనేఫెస్టోలో పేర్కొన్నట్లు తెలిపారు.

వార్డు సభ్యులుగా గెలవలేని వారు విమర్శలా

టీడీపీలో వార్డు సభ్యులుగా కూడా గెలవలేని వారు తమ పార్టీ నాయకులపై విమర్శలు చేస్తే సహించేది లేదని ఎమ్మెల్యే కాటసాని అన్నారు. తన భిక్షతో గతంలో ప్రజాప్రతినిధిగా గెలిచి ఇప్పుడు టీడీపీలో ఉండి తమపైనే విమర్శలు చేస్తే ఉరుకోబోమన్నారు. మంచి పనులతో ప్రజల మెప్పు పొందాలే కాని వ్యక్తిగత విమర్శలు చేస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు సద్దల సరళమ్మ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు, పార్వతమ్మ, ఎంపీటీసీలు గణేష్, వరలక్ష్మీ, సర్పంచ్‌లు సద్దల సుజిత్‌రెడ్డి, మహబూబ్‌బాషా, లింగాల శారదమ్మ, మాధవి, కో–ఆప్షన్ సభ్యుడు జాకీర్ ఉసేన్, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, ఈశ్వరయ్య, ప్రసాద్, సుబ్బారెడ్డి, ఉసేన్‌సా, అమర్‌నాథ్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శివారెడ్డి, రాముడు, ఎల్లకిట్టు, నరేంద్ర, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పాణ్యం: టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరికలు కొనసాగుతున్నాయి. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సమక్షంలో కొండజుటూరు, నెరవాడ గ్రామలకు చెందిన టీడీపీ నాయకులు ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కొండజుటూరు గ్రామంలో పరంకి రజీవా, కానాల పవన్, నెరవాడ గ్రామానికి చెందిన నూక సుధీర్‌కుమార్‌రెడ్డి, నూక శ్రీనివాసరెడ్డి, మానవ శేషిరెడ్డి, దేవసాని శ్రీనివాసులు, దేవసాని రామసుబ్బయ్య, దూదేకుల మదార్‌సా, మాలే రాజశేఖర్, నీరజ్ సహా పలు కుటుంబాలు టీడీపీకి స్వస్తి చెప్పి వైఎస్సార్‌సీపీలో చేరాయి. టీడీపీలో కష్టపడేవారికి గుర్తింపు, గౌరవం లేదని.. ప్రజలకు మంచి చేస్తున్న జగనన్నకు అండగా ఉంటామని వారు తెలిపారు. కాటసాని విజయానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లింగాల శారదమ్మ, నాయకులు ప్రతాప్‌రెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, రమణారెడ్డి, శివారెడ్డి, జ్యోతిస్వరూప్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే బలపనూరు గ్రామంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డితో పాటు ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి తనయుడు పోచా జనార్దన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకురాలు శశికళరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు సద్దల సరళమ్మ, ఎంపీపీ ఉసేన్‌బీ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్ద సూర్యనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీలు వెంకటేశ్వర్లు, పార్వతమ్మ, ఎంపీటీసీ సభ్యులు వరలక్ష్మీ, సర్పంచ్ మాధవి, నాయకులు భాస్కర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రామచంద్రుడు, కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, నాగేంద్ర, జయచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ట



కలశాలను ఊరేగింపుగా తీసుకెళుతున్న భక్తులు



శాంతి హోమం చేస్తున్న పురోహితులు



కాశీవిశ్వనాథస్వామి



ఆంజనేయస్వామి

గూడూరు రూరల్: మండల పరిధిలోని పెంచికలపాడులో నూతన ఆలయాల్లో దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఆదివారం వైభవంగా జరిగింది. గ్రామ పెద్దలు, ప్రజల ఆధ్వర్యంలో ప్రాతఃకాల పూజ, యంత్రపూజ, అర్చన, యంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట, హోమాలు, అష్టబంధన విగ్రహ ప్రాణ ప్రతిష్ట, కుష్మాండబలి, కక్షజ్వాల, గోదర్శనం, మంగళహారతి, పూర్ణాహుతి, కలశ ఉద్వాసన, ప్రోక్షణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కొత్తగా నిర్మించిన దేవాలయాల్లో ఏర్పాటు చేసిన గణపతి, కుమారస్వామి, కాశీ విశ్వనాథస్వామి, నందీశ్వరుడు, ఆంజనేయస్వామి విగ్రహాల ప్రతిష్ట చేసేందుకు స్థానిక శివాలయం నుంచి మంగళవాయిద్యాలతో కలశాలను తీసుకొచ్చారు. వేద మంత్రోచ్ఛారణలు, శాంతి హోమాల మధ్య బ్రహ్మశ్రీ వెంకటరమణశర్మ ఆధ్వర్యంలో ప్రాణప్రతిష్ట శాస్త్రోక్తంగా జరిగింది. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



పెద్ద లక్ష్మన్న (ఫైల్)

గోనెగండ్ల: మండల పరిధిలోని హెచ్.కై రవాడి గ్రామానికి చెందిన బోయ పెద్ద లక్ష్మన్న (64) కడుపునొప్పి తాళలేక పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ రామకృష్ణయ్య తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బోయ పెద్ద లక్ష్మన్న గత కొద్ది రోజులుగా కడుపునొప్పితో బాధపడుతుండేవాడు. జీవితంపై విరక్తి చెంది శనివారం మధ్యాహ్నం ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కోలుకోలేక శనివారం రాత్రి మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మిదేవమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.



వర్కూరులో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి

సంక్షేమం, అభివృద్ధే జగన్ అజెండా

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్ష

కోడుమూరు రూరల్: సంక్షేమం, అభివృద్ధే అజెండాగా పాలన సాగిస్తున్న జగనన్నను మరోసారి ఆశీర్వదించి గెలిపించుకోవాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి ప్రజలను కోరారు. ఆదివారం సాయంత్రం మండలంలోని వర్కూరు గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రస్తుత ఎన్నికలు పేదలకు, పెత్తందారుల మధ్య జరుగుతున్నాయని, అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, భవిష్యత్‌లో మరిన్ని పథకాలు పొందాలన్నా మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నియోజకవర్గ రైతుల సంక్షేమం కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గాజులదిన్నె ప్రాజెక్టు సామర్థ్యాన్ని 4నుంచి 5 టీఎంసీలకు పెంచిందని తెలిపారు. అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేయాలని చూస్తున్న చంద్రబాబుకు ఈ ఎన్నికల్లో మరోసారి బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, క్రిష్ణాపురం సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి, ఉపసర్పంచ్ ప్రవీణ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు కొలయ్య, హనుమంతు, నాయకులు రమణారెడ్డి, రామకృష్ణారెడ్డి, సోమశేఖరరెడ్డి, దస్తగిరి, పాపిరెడ్డి, తోటయ్య, సుధాకర్, రంగడు, మాదన్న పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన పోలకల్ టీడీపీ నాయకులు

వైఎస్సార్‌సీపీలోకి వలసల వెల్లువ

- టీడీపీ, జనసేన నుంచి భారీగా చేరికలు
- సాదరంగా ఆహ్వానించిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్, కుడా చైర్మన్ హర్ష



ఆహ్వానిస్తున్న కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి

సి.బెళగల్: సి.బెళగల్ మండలంలో టీడీపీ, జనసేనకు భారీ షాక్ తగిలింది. ఆదివారం ఆయా పార్టీలకు చెందిన సుమారు వెయ్యి మంది నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. జనసేన మండల నాయకుడు కొత్తకోట మహబూబ్‌బాషా ఆధ్వర్యంలో పలు గ్రామాలకు చెందిన ఆ పార్టీ నాయకులు అహ్మద్ బాషా, ఉమర్, అలీ, రఫిక్, హుసేన్, రామకృష్ణ, సుధాకర్, నాయుడు, ఇబ్రహీం, రెహ్మాన్, ఇస్మాయిల్, అంజి, అలిబాషా, రవి, షెక్షావలి, మహబూబ్, మల్లికార్జున, షాకీర్, వలి, గపూర్ సహా 500 మందికి వైఎస్సార్‌సీపీ కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. అలాగే పోలకల్ గ్రామానికి చెందిన రాజేష్ ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన ఎల్లప్ప, వెంకటేష్, పూలదాసు, లక్ష్మన్న, గంగన్న, వసంత, వెంకట్, దేవరాజు, ఆనందు, ప్రభాకర్, సూర్యబాబు, గిరి, సురేష్, గాలి గంగన్న, ఎల్లోజి, బోయేజు, నడిపి అయ్యన్న, మహేష్, శంకర్, థామస్, చక్రవల్లి సహా 500 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి, పార్టీ జిల్లా మైనార్టీ కార్యదర్శి ఎస్ఎం బాషా, జేసీఎస్ మండల కన్వీనర్ తులసిరెడ్డి, నాయకులు మద్దిలేటి, వెంకటేష్, గోపాల్, రామకృష్ణ, నాగేశ్వరరెడ్డి, హారున్‌రషీద్ పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

సి.బెళగల్: అనారోగ్య సమస్యలతో కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న సి.బెళగల్ గ్రామానికి చెందిన బోయ చిన్నరాముడు, లక్ష్మీ దేవమ్మను వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్ పరామర్శించారు. అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. పార్టీ మండల అధ్యక్షుడు సోమశేఖర్ రెడ్డి, మండల కార్యదర్శి మద్దిలేటి, జేసీఎస్ మండల కన్వీనర్ సీబీ తులసిరెడ్డి ఉన్నారు.

బాబును నమ్మితే మోసపోతాం

కర్నూలు సిటీ: టీడీపీ అధినేత చంద్రబాబు మాయమాటలు నమ్మితే మోసపోవాల్సి వస్తుందని ఆదిమూలపు సతీష్ ప్రజలను హెచ్చరించారు. ఇచ్చిన మాట మీద నిలబడి మంచి చేసే నాయకుడు వైఎస్ జగన మాత్రమేనని, ఎన్నికల్లో ఆయనను మరోసారి గెలిపించుకొని సీఎం చేసుకుందామని పిలుపునిచ్చారు. ఆదివారం కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మణిగాంధీ, కొత్తకోట ప్రకాష్‌రెడ్డిలతో కలిసి కర్నూలు అర్బన్ 38వ వార్డు గీతాముఖర్జీ నగర్, సమతా నగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

జగనన్నతోనే సంక్షేమ పాలన



కోడుమూరులో ఇంటింటి ప్రచారం చేస్తున్న స్టెల్లా సతీష్

కోడుమూరు: జగనన్నతోనే సంక్షేమ పాలన సాధ్యమవుతుందని.. ప్రజల మేలు కోరే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్ భార్య స్టెల్లా సతీష్ కోరారు. ఆదివారం కోడుమూరులోని కోటవీధి, మునిమంద, చాకలివీధుల్లో సింగిల్‌విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అహర్నిశలు పేదల సంక్షేమం కోసం జగనన్న కృషి చేస్తున్నారని, వారు ఆర్థికాభివృద్ధి సాధించాలన్న తపనతో ప్రతి పథకాన్ని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నారని తెలిపారు. గ్రామ సచివాలయాలు, వలంటరీ వ్యవస్థ ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మాదులు, మాజీ ఉపసర్పంచ్ ప్రవీణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్‌నాయుడు, నాయకులు మల్లారెడ్డి, తేనేశ్వరరెడ్డి, మగ్బుల్‌బాషా, బైన్‌దొడ్డి హనుమంతు, కల్యాణ్, లింగమయ్య, లింగన్న, రాఘవేంద్ర, విష్ణుదాసు, కట్టెల శ్రీనివాసులు, జగదీష్, మాసుమ్ తదితరులు పాల్గొన్నారు.

పల్లె.. ప్రగతి బాట

- రూ.2.95 కోట్లతో కోడుమూరు –క్రిష్ణాపురం రోడ్డు నిర్మాణం
- నెరవేరిన దశాబ్దాల కల
- వైఎస్సార్‌సీపీ హయాంలో గ్రామీణ రోడ్లకు మోక్షం

క్రిష్ణాపురం.. నియోజకవర్గ కేంద్రం కోడుమూరు నుంచి 5 కి.మీ. దూరంలోని ఓ గ్రామం. అక్కడికి వెళ్లాలంటే గుంతలమయంగా ఉన్న రోడ్డే దిక్కు. ఐదు కిలోమీటర్ల ప్రయాణానికి సుమారు 40 నిమిషాలు పట్టేది. ఆ రోడ్డును చూస్తేనే వాహనదారులు హడల్. ఇక ఆటోవాలాలు ఆవైపు వెళ్లాలంటే జడుసుకుంటారు. కొన్నేళ్ల పాటు ఇదే పరిస్థితి. గత టీడీపీ హయాంలో రోడ్డు బాగు చేయాలని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకున్న పాపానపోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.2.95 కోట్లు విడుదల చేసి రెండు నెలల్లో పనులు పూర్తి చేసింది.

కోడుమూరు రూరల్: రోడ్ల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇచ్చింది. విరివిగా నిధులు మంజూరు చేసి మారుమూల రహదారులను సైతం బాగు చేసింది. ఇదే కోవలో కోడుమూరు–క్రిష్ణాపురం రోడ్డుకు మోక్షం లభించింది. రెండు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న గ్రామస్తుల కల సాకారమైంది. క్రిష్ణాపురం గ్రామానికే కాకుండా క్రిష్ణగిరి మండలంలోని పోతుగల్లు, సంగాల, ఆగవేళి, గుండ్లమల్లాపురం, చుంచెర్రగుడి తదితర గ్రామాలకు వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి. రోడ్డంతా గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు, వాహనదారులు కొన్నేళ్లుగా పడుతూ లేస్తూ ప్రయాణాలు సాగించారు. రోడ్డు బాగు చేయాలని గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పలుమార్లు గ్రామస్తులు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదు. రోడ్డు వేస్తామంటూ అదిగో ఇదిగో అంటూ ఐదేళ్ల పాలనను టీడీపీ ప్రభుత్వం పూర్తి చేసిందే తప్ప కనీసం రోడ్డు మరమ్మతుల కోసం తట్టెడు మట్టి వేసింది లేదు. 2019లో అధికారంలోకొచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం క్రిష్ణాపురం గ్రామ ప్రజలతో పాటు, క్రిష్ణగిరి మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్డు సమస్యను పరిష్కరించేందుకు రూ.2.95 కోట్లను విడుదల చేసింది. విడుదలైన నిధులతో ఈ ఏడాది జనవరిలో రోడ్డు నిర్మాణ పనులను చేపట్టి 2 నెలల్లోనే రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేసింది. రెండు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న రోడ్డు సమస్యను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పరిష్కరించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డికి కృతజ్ఞతలు చెబుతున్నారు.



నాడు.. గుంతలమయంగా ఉన్న కోడుమూరు -క్రిష్ణాపురం రోడ్డు



నేడు.. కోడుమూరు నుంచి క్రిష్ణాపురం గ్రామానికి వెళ్లేందుకు వేసిన చక్కటి రోడ్డు

జగనన్నకు రుణపడి ఉంటాం



మా ఊరికి రోడ్డు లేక చాలా ఏళ్లు ఇబ్బందులు పడ్డాం. రోడ్డు సరిగ్గా లేకపోవడంతో కొందరు ఊరిని సైతం వదిలి కోడుమూరు, కర్నూలులో నివాసముంటున్నారు. గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రోడ్డు నిర్మాణానికి రూ.2.95 కోట్లు మంజూరు చేయడం, రెండు నెలల్లోనే రోడ్డు నిర్మాణం పూర్తి చేయడం ఎంతో ఆనందంగా ఉంది. మా గ్రామానికి చక్కటి రోడ్డు వేయించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కుడా చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

–శ్రీనివాసరెడ్డి, సర్పంచ్, క్రిష్ణాపురం

ఎంతో సంతోషంగా ఉంది



రోడ్డంతా గుంతలమయంగా మారడంతో ఐదు కిలోమీటర్ల ప్రయాణానికి అరగంటకు పైగా సమయం పట్టేది. గత టీడీపీ హయాంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదు. ఇలాంటి పరిస్థితుల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మా ఊరికి రోడ్డు వేసేందుకు నిధులు మంజూరు చేయడంతో పాటు వేగవంతంగా నిర్మాణ పనులు పూర్తి కావడంతో పది నిమిషాల్లో కోడుమూరుకు చేరుకుంటున్నాం. చాలా సంతోషంగా ఉంది.

–విజయ్‌కుమార్‌రెడ్డి, క్రిష్ణాపురం గ్రామం, కోడుమూరు మండలం

కోలుకోలేక వివాహిత మృతి

వెల్దుర్తి(కృష్ణగిరి): ఆత్మహత్యకు యత్నించి కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మండల పరిధిలోని రామళ్లకోటకు చెందిన స్వాములు భార్య దాసరి చంద్రకళ(30) కోలుకోలేక ఆదివారం మృతిచెందింది. ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపిన వివరాలు.. కడుపు నొప్పి తాళలేక ఈనెల 17న ఇంట్లో పురుగు మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. అక్కడ కోలుకోలేక మృతిచెందింది. మృతురాలి సోదరుడు సురేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కాగా మృతురాలికి ముగ్గురు కూతుళ్ల ఉన్నారు.

దాడి కేసు నమోదు

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల పరిధిలోని రామళ్లకోటకు చెందిన మహిళపై అసభ్యంగా ప్రవర్తించి ఆమె కుమారుడు, అల్లుడిపై దాడి చేసిన ఘటనలో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఈనెల 25న మాసూంబీ ఇంటి వద్ద అదే గ్రామానికి చెందిన ఒకే కుటుంబీకులైన గొల్ల రామచంద్రుడు, గోపాల్, వెంకటేష్, గణేశ్ మద్యం తాగుతూ అసభ్యంగా ప్రవర్తిసుండగా అడ్డు వచ్చిన మాసూంబీని దూషిస్తూ, కుమారుడు దస్తగిరి, అల్లుడు మహబూబ్‌బాషాలపై దాడి చేసి గాయపరిచారు. క్షతగాత్రులు వెల్దుర్తి ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం మాసూంబీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.